# మర్రి చెట్టు

ఎడారిలో ఒయాసిస్సులా, నిదాఘంలో జడివానలా, కర్ణ కఠోరమైన రణగొణ ధ్వనులు ఆగిపోయిన తర్వాత శ్రావ్యంగా వినిపింప సాగిన వీణాగానంలా — మండుటెండలో మర్రిచెట్టు !

కనుచూపుమేరవరకూ ఎర్రటి దుమ్మును ఎగబోసుకుని బీళ్లుబీళ్ళుగా పడివున్న చేలు, వాటి గనుమల్లో వడగాలికి గరగరలాడే బోదదుబ్బలు, యింకా రేణు గంపలు, చిట్టీతచెట్లు, సూర్యరశ్మిని కత్తులుగా, ఈటెలుగా మార్చి రెండు వైపులా పదును పెట్టి లోకం పైకి త్రిప్పి కొడుతున్న బండలతో నిండిన గుట్టలు. ఆ బండల మధ్య అదురూ బెదురూ లేకుండా నిల్చి వున్న బొంత జముళ్ళు — యిలాంటి పరిసరాల మధ్య పాపంలో

పుణ్యంలా, నిరాశలో ఆశలా, చీకటిలో వెలుగులా మండు ఎండలో ఒక మర్రిచెట్టు !

నూరంటే నూరనొచ్చును, అన్ని వూడలు దానికి ! వందలూ వేలూ అంటే అబ్బురంకాదు, అన్ని కొమ్మలు దానికి ! అన్నీ పెద్దవి, అంతకంటే చిన్నవీ మరి చిన్నవీ అయిన శాఖోపశాఖలతో మానవ శరీరంలో రక్తనాళాలకు మల్లే నలు మూలలకూ విస్తరిల్లి భగవంతుడు ప్రాణిలోకానికి ప్రసాదించిన శాశ్వతమైన అతపత్రంలా గంభీరంగా నిలబడి వున్న మర్రిచెట్టు!

హేమంతంలో మంచునీట తానమాడి, శిశిరంలో ప్రాజీర్ణ వూడ్చివేసి, వసంతంలో క్రొత్తచీర కైసేసి, గ్రీష్మంలో మాతృమూర్తిలా మార్గాయాసంలో డస్సిన పాంధులను తన ఒడిలోకి తీసుకుని స్వేదం తుడిచి, సేద తీర్చి చల్లగా అతిథ్యాన్ని నెరపే మర్రిచెట్టు !

ఇంతకు అది ఊహా చిత్రంగాదు ! నిజం ! ఆ మర్రిచెట్టు నేటికీ వుంది.

పట్టణానికీ పల్లెటూరికీ ఏడుమైళ్ళ దూరం. పట్టణంనుంచీ పల్లెటూరికి వెళ్లే మట్టిబాట ఆ మర్రిచెట్టుకు పది బారల దూరంలో వెళ్తుంది.

ఆ పల్లెటూరే మా వూరు.

ఆ పట్టణంలోనే చదువుకున్నాను.

మునసబుగారబ్బాయి చంద్రం, కరణంగారబ్బాయి కృష్ణ, చౌదరిగారి కుర్రాడు శ్రీరాములు యింకా అలాంటివాళ్ళు ఏడెనిమిదిమందితో బాటు నేనూ హైస్కూల్లో చేరిపోయాను.

చేరడానికేముంది ! ఉబలాటం కొద్దీ చవి పెంచుకోవచ్చు కానీ చిక్కు రావడం మల్లా డబ్బు కావలసి వచ్చినప్పుడే !

అసలు నేను హైస్కూల్లో చేరకముందే, అడుగులోనే హంస పాదులా యింట్లో కాస్త గొడవ జరిగింది.

"అదేమిటండీ, అలా నిమ్మకు నీరెత్తినట్టు కదలకుండా కూర్చున్నారు ! ఊళ్లో కుర్రాళ్ళందరూ హైస్కూల్లో చేర బోతున్నారటగా ! రామాన్ని ఏం చేద్దామనుకుంటున్నారు ఎద్దులుకొట్టి ముద్దులు తినడానికి మీరు నాలుగు సెంట్ల పొల మైనా సంపాదించిపెట్టారు గనుకనా ! చదువుకోకపోతే వాడెం దుకు పనికొస్తాడు ?" అంటూ రంగంలో ప్రవేశించింది మా అమ్మ.

"అబ్బే నేనూ ఆలోచిస్తున్నానే ! నీ కొడుకు చదువు కోవాలన్న ఆశ నీకుంటుంది. న్యాయమే ! కానీ నువ్వు నా పరిస్థితి కూడా కాస్త ఆలోచించాలి. మనం వీడిని బడిలో చేర్చ గలం ! చచ్చీ చెడీ పుస్తకాలు కొనివ్వగలం, ఫీజూ కట్టగలం కానీ హోటల్లో మాత్రం చేర్పించలేము. అది మనతాహతుకు మించిన పని. నడిచి వెళ్ళి చదువుకో మందామంటేనా, రేపటా మాపటా ఏడేడు పద్నాలుగు మైళ్ళు తిరగడానికి ఈ వెధవ వేలెడంతైనా లేడాయె ! పోనీలే, యిప్పుడు మించి పోయిం దేముంది ? వచ్చే ఏడాదికి చూచుకుందాములే" అన్నారు నాన్నగారు.

అమ్మ వంటయింటి గుమ్మంలో నిలబడి నాన్నగారితో మాట్లాడుతోంది. నేను తలుపుచాటున నిలబడి ఆమె కొంగును లాగుతున్నాను !

"ఊహు, ఈ విషయంలో మాత్రం వాయిదాలు పెట్ట కండి బాబూ, మీకు పుణ్యముంటుంది! పనీ పాటా లేకుండా ఒక్క సంవత్సరం యింటి దగ్గరే వుండిపోతే కుర్రాడు ఒగ్గై పోతాడు. తరువాత మీరు చదువుకోమన్నా చదువుకోకుండా రాలుగాయలా తయారవుతాడు మీకెందుకూ! వాడి పాట్లేవో వాడు పడ్తాడు. మీరు స్కూల్లో చేర్పించితే చాలు అదే మాకు పదివేలు!"

"ఐతే కుర్రాడి బాగును గురించి శ్రద్ధ వున్నదల్లా నీకొక్క దానికేనన్నమాట!"

"మీకూ వుంది లెండి – శ్రద్ధ! తెలుస్తూనేవుందిగా!" అంటూ మా అమ్మ ఒక్క విసురుతో దూరంగా వెళ్ళిపోయింది.

నిండుగా రెండు రోజులు ఆలోచించిన తర్వాత నాన్న గారు తమ నిర్ణయాన్ని ప్రకటించారు.

"ఇదిగో, నీకే చెబుతున్నది! నేనేమో నీ మాట మేరకు కుర్రాణ్ణి స్కూల్లో చేర్పించేస్తున్నాను. కానీ మన పాలి టికి రాబోతున్నవన్నీ గడ్డు రోజులు. ఈ పూరికొంపపైన కప్పెగిరిపోతుంది. మొదట బోదకొని కొత్త కప్పేసుకోవాలి. పైగా మనది పిల్లా జెల్లా వున్న కుటుంబం. నా జీతం రాళ్ళు తిండికే సరిపోవు. అక్కడ హైస్కూల్లో కరణంగారబ్బాయి కొత్తదుస్తులు కుట్టించుకున్నాడనీ, మునసబుగారి కుర్రాడు మంచికలం కొన్నాడనీ లేని పోని ఖర్చులన్నీ యింటిపైకి తెస్తే నేను భరించే వాణ్ణిగాను! నాకు తెలిసిందల్లా ఒక్కటే ఒక్కటి. ఒక చిన్న టిఫిన్ కారియరు కొని పెడ్తాను. నువ్వు తెల్లవారు

జాముస ఏ వేళప్పుడు లేస్తావో నాకు తెలియదు. ప్రొద్దు పుట్టే సరికి యింత వండి పెట్టు. తీసుకుని బడికి వెళ్తాడు. మనం చేయ గలిగిందంతే ! ఆ తరువాత వాడు చదువుకుంటే బాగుపడ్తాడు. లేకుంటే వాడి ఖర్మ కొద్దికి పోతాడు..."

నాన్నగారి షరతులన్నింటికీ మేము కిమ్మనకుండా సమ్మతించడమేమిటి, పరీక్ష, జీతం చెల్లింపు మొదలైన తతంగం జరిగిన తర్వాత నా పేరు పాఠశాల రిజిష్టర్లలో నమోదు కావడ మేమిటి, నా చేతికి టిపిన్ కారియర్ రావడమేమిటీ—యివన్నీ ఆ తరువాత జరిగిన సంగతులు !

హాస్టల్లో చేరినవాళ్ళు చేరిపోగా, పల్లెకూ పట్టణానికి నడచి చదువుకోడంలో నాకిద్దరు సహచరులు మాత్రం దొరి కారు. ఒకడు రోడ్డుకూలీ రామస్వామి కొడుకు రుపే రంగడు, మరొకడు జంగం గురుమూర్తిగారి కుర్రాడు, గౌరీపతి. మేము ముగ్గురమూ యింటి దగ్గర బయల్దేరినప్పుడైతే అదొక క్రీడలా బయల్దేరేవాళ్ళం. సాయంత్రం ఏడు గంటలకు మళ్ళీ యింటిముఖం చూసేసరికి మాఒళ్ళంతా హూనమైపోయేది. వేడి నీళ్ళతో స్నానం చేసి దీపందగ్గర కూచుంటే నిద్రముంచు కొచ్చేసేది. అలాగే నేలపైకి వ్రాలిపోయేవాణ్ణి. అరుగుపైన పడుకున్న నాన్నగారు పదినిమిషాలకొకసారి "చదువుతున్నాడా, లేదా" అని పరామర్శించేవారు ! "చదవకేంచేస్తాడుగానీ మీరు పడుకోండి" అని అమ్మ సర్ది చెబుతుండేది.

ఇలా రెండు మూడేళ్ళు గడచిపోయాయి. నేను మూడోఫారంపాసై, నాలుగో ఫారంలో ప్రవేశించాను !

ఒకరోజు ఉదయం మాక్లాసుటీచరు మామూలు కన్నా వుత్సాహంగా తరగతి గదిలోకి వచ్చారు. ఒకటి రెండు నిమిషాల్లో అటెండెన్సు వేయడం ముగించి, పైకిలేస్తూ "మీకు నేనొక ఆనందకరమైన వార్త చెప్పబోతున్నాను." అన్నారు.

"ఏమిటేమిటి ?" అని అందరూ ఒక్కుమ్మడిగా అడిగేశారు.

"అదే, అదే. నేనాదినుంచీ మొత్తుకుంటూ వున్నది, అలా గోల చేయకూడదనే ! అందరూ నిశ్శబ్దంగావుంటే చెబుతాను ... ఈనెల కడపటి వారంలో మనం ఎక్స్‌కర్షను వెళ్ళబోతున్నాము."

"ఎక్కడికి మేష్టరుగారూ ! ఎక్కడికో చెప్పరూ..."- మళ్ళీగోల !

కుర్రాళ్ళ కుతూహలాన్నిచూచి, ముసిముసి నవుగలు నవ్వుకుంటూ మేష్టారుగారు చెప్పసాగారు. "మొదట కంచి. ఆ తర్వాత చెన్నపట్నం. అక్కడినుంచే పక్షితీర్థం, చిట్టచివర మహాబలిపురం. కంచికామాక్షిని గురించి మీరు వినేవుంటారు. అది దేవాలయాల పట్టణం. ఇక మదరాసు సంగతి సరేసరి ! మ్యూజియం, మృగశాల, దీపగృహం, విమానాశ్రయం,— ఇలాంటి చూడదగిన విశేషాలు చాలావున్నాయి. పక్షితీర్థంలో పదకొండున్నర గంటలకు సరిగ్గా రెండు పక్షులు జంటగావచ్చి ప్రసాదాన్ని స్వీకరించి వెళ్ళిపోయేదృశ్యం - నిజంగా మనకు విస్మయాన్ని కలిగిస్తుంది. ఇక మహాబలిపురాన్ని గురించి చరిత్ర పాఠాల్లో రానేవచ్చింది.! పల్లవుల శిల్పకళా పరాకా

ష్టకు చేరుకున్న ఏకశిలా రథాలు అక్కడే ఉన్నాయి. అన్నిటినీ మించి సముద్రతీరంలో ఆ దేవాలయం, భుగభుగమని పైకెగసి, రాళ్ళకు ఢీకొని మంచి ముత్యాలకు మల్లే జల్లు జల్లున పైకెగిరి, రంభసంతో చెలియని కట్టను తాకి మళ్ళీ వెనక్కు మరలిపోయే ఆ సముద్రతరంగాలు—అదుత్భమైన ఆప్రకృతి సౌందర్యం అవన్నీ చూచి తీరవలసిందేగాని, చప్పగా, అవిగూడా ఒక పాఠంలా చెప్పుక పోదగినవిగావు. ఇంతదూరం వెళ్ళి రావడానికి మీరు ఒక్కొక్కరూ వెచ్చించవలసింది పది రూపాయలు మాత్రమే! చాలని దానికి స్కూల్ ఫండ్సలో నుంచి కొంత డబ్బివ్వడానికి హెడ్మాష్టరుగారు అంగీకరించారు..."

మేష్టారుగారు ఒకటి రెండు క్షణాల పాటు మౌనం వహించారు. క్లాసంతా నిశ్శబ్దంగావుంది.

"ఇలాంటి అవకాశం మాటిమాటికీ వచ్చేది గాదు. అదను మించితే ఆశాభంగం! కమాన్, ఎవరెవరు రాదలుచుకున్నారో లేచి నిలబడండి!"

మేష్టారుగారి నోటివెంట మాట వచ్చీరాక ముందే తరగతి తరగతంతా పైకి లేచేసింది.

లేవనివాణ్ణి నేనొక్కణ్ణి మాత్రమే!

తలవంచుకుని బెంచీకి అంటుకపోయి అటూ ఇటూ చూచాను. ఆఖిరికు రంగడు సైతం లేచాడు! గౌరీపతి గూడా నిలబడి నావైపు ఓరచూపులు సారిస్తూ 'యిహిహి' అని పళ్ళికిలిస్తున్నాడు!

"ఏమిట్రా రామం! నువ్వు మాత్రం..."

వాక్యం పూర్తిగాక ముందే లేచి నిల్చున్నాను.

"నా పేరుగూడా వ్రాసుకోండి మేష్టారుగారూ. నేనూ వస్తున్నాను..." అన్నాను.

అన్నానేగాని అన్నమాట నెలా నెగ్గించుకోగలనో నాకు బోధపడడం లేదు!

"రైట్, అలావుండాలి. ఐతే మనక్లాసు క్లాసంతా విహారానికి కదులుతుందన్న మాట! కానీ ఒక్క విషయాన్ని జ్ఞప్తిలో వుంచుకోండి. మనకు అట్టే వ్యవధిలేదు. వారంరోజుల్లో మీరు డబ్బు చెల్లించేయాలి..." అంటూ ఆ ప్రస్తావన అంతటితో ఆపి పాఠం చేతికి తీసుకున్నారు మేష్టారుగారు!

బిక్కు బిక్కు మంటున్న గుండెను అరచేతిలో చిక్కబట్టుకుని సాయంత్రం యింటికి తిరిగి వెళ్ళాను. నాన్నగారితో ముఖా ముఖిగా మాట్లాడే ధైర్యం నా కేనాడూ లేదు. ఆలనకైనా పాలనకైనా మా అమ్మేనాకు శరణ్యం! ఆమె దగ్గర మెల్లగా ఈ విషయాన్ని ప్రస్తావించాను.

"బాబ్బాబూ! నీకు పుణ్యముంటుంది గానీ నువ్వూరుకోరా! ఈమాట చెబితే మీ నాన్నగారు మండిపడ్తారు. అదీకాక శుభ్రంగా చదువుకోవాలి గాని, మనం అదొక పనిగా వూళ్ళు తిరగ్గలమా చెప్పు..."

కాదమ్మా! మరెప్పుడూ అడగను. క్లాసులో అందరూ నేను రానని చెబుతే నలుగురిలో నగుబాటు తప్పితే మరేమి

లేదు. వెళ్ళక తప్పదు. పేరుగూడా యిచ్చేసాను. నువ్వెలాగో నాన్నగారిని ఒప్పించాలి..."

"ఊహూ, మీనాన్నగారిని ఒప్పించడమే! అది నాతరం కాదు బాబూ!" నామాట మొదలంట కొట్టివేసి ఆమె తనపనిలో తను లీనమై పోయింది.

నాకు ఏడుపు వచ్చినంత పనైంది. వుక్రోషంలో విలవిల లాడిపోయాను. తలను గోడకివేసి బాదుకుందా మనుకున్నాను. అమ్మను మింగేయాలన్నంత కోపం వచ్చింది. అన్నింటికి చివర ఆమెను లొంగతీసుకోడానికి నాకున్నదొక్కటే తరుణోపాయం. అది యిదివర కెన్నిసార్లో బ్రహ్మాస్త్రంలా వుపకరించింది గూడా! క్షణాల్లో దాన్ని అమల్లో పెట్టేశాను — స్నానం చేయను పొమ్మన్నాను! అన్నం తిననంటే తిననన్నాను.

అమ్మ ఏమనుకుందో గాని మూకీభావంతో వూరుకుంది.

నాన్నగారు ట్యూషన్లూ అవీ చూచుకొని ఎనిమిది గంటలకు యింటికి వచ్చారు. రాగానే "ఏడీవాడు! ఇంకా దీపం దగ్గర కూర్చోలేదేమిటి?" అంటూ కేక వేశారు.

"రారా రామం! స్నానంచేద్దువుగానిరా" అంది అమ్మ. ఏమీ ఎరగనట్టు!

పిల్లిలా తోక ముడుచుకుని పెరట్లోకి దారితీశాను. అలా చేయకపోతే ఏమవుతుందో నాకు తెలుసు. వీలైనంతవరకూ నావీపును( కాకపోతేశరీరాన్ని) పదిలంగా వుంచుకోవాలనుకోడం మానవ సహజం!

కానీ రాజధానిలో తిరుగుబాటు చేయడానికి వీల్లేక మారుమూల ప్రాంతంలో టెలిగ్రాపు తీగలకు ఎసరు పెట్టిన దేశభక్తుడికి మల్లే నేను పెరట్లో నా విప్లవాన్ని కొనసాగించాను. వేడినీళ్ళను జలదారిలో దొర్లించాను. చన్నీటిని ఒంటి మీద దిమ్మరించు కున్నాను. ఒళ్ళు తుడిచీ తుడుచుకోకుండా ఉడుపులు తొడుక్కున్నాను.

అమ్మ కిక్కురు మనకుండా చూస్తూనే వూరుకుంది.

"ఐతే యింకా తీరిక కాలేదన్న మాట! ఏంచేస్తున్నావురా రామం!'' హుంకరిస్తున్నారు నాన్నగారు.

"అన్నం పెట్టానురా రామం! భోజనంచేసి వెళ్దువు గానిరా" వంటగదిలో నుంచి అమ్మ పిలుస్తోంది.

కంచం ఎదుట కూర్చున్నాను. అన్నాన్ని చిందర వందర చేశాను. ఒక్క ముద్దె నా నోట్లో వేసుకోకుండా అయిదు నిమిషాలసేపు తిన్నట్లు అభినయించాను. ఆ తర్వాత లేచి దీపందగ్గరకు బయల్దేరాను.

పుస్తకాన్ని తెరచి ఏదో చదవసాగాను కానీ మనసు చదువుపైన లగ్నం కాలేదని ప్రత్యేకించి చెప్పడం అనవసరం!

ఆమాటకొస్తే ఆరాత్రి మలిజాము గడిచేదాకా కునుకు గూడా పట్టిందిగాదు.

నిద్రలేచేసరికి ప్రొద్దు పొడిచింది. తొందర తొందరగా ముఖం కడుక్కుని స్కూలుకు సిద్ధమై గుమ్మం దగ్గరకు

వచ్చాను. రంగడూ గౌరీపతీ విజయోత్సాహంతో మాయింటిని సమీపిస్తున్నారు.

"మేము పదిరూపాయలు తెచ్చేశాముగా! మీ నాన్న గారేమన్నారు?" అన్నాడు గౌరీపతీ.

"ఏమంటారు? రేపోమాపో యిస్తారు. ఇప్పుడు తొందరేముంది? ఇంకా గడువుంది గదా!"

నేనింట్లో కొనసాగిస్తున్న అంతర్యుద్ధం. సంగతి వాళ్ళకు తెలియడం నాకిష్టంలేదు. వాళ్ళకు తెలియక మునుపే నేనా అంతర్యుద్ధంలో విజయం సాధింప గలననే భావించాను.

కానీ ఈ విషయంలో నేననుకున్న దొకటి! ఐనది వేరొకటి!

నాలుగోనాటికల్లా నాన్నగారు నావాలకాన్ని పసిగట్టేశారు. నిలదీసి అడిగి అమ్మనోటి నుంచీ అసలు విషయాన్ని రాబట్టారు. ఆరోజు సాయంత్రం నేను ఇంటికి వెళ్లేసరికి ఉగ్ర నారసింహ స్వరూపంలో సాక్షాత్కరించారు!

"ఏమిట్రా. నీకు ఎక్స్‌కర్షనొక్కటే తక్కువైందిగదూ! పంపకపోతే అన్నం ముట్టవుగదూ! ఊహు, నీ వ్యవహారం అంతలో వుందన్నమాట! ఏమనుకుంటున్నాదోమరి. నిన్ను చీరేస్తాను. ఇకపైన ఆ మాట ఎత్తావంటే నీవళ్ళు నీదిగాదు!"

నేను బిక్కచచ్చిపోయాను. దీనంగా అమ్మకేసి చూశాను. ఆమె అంతకంటే జాలిగా, నిస్సహాయంగా నావైపు చూస్తోంది.

పదిపదిహేనేళ్ళ తర్వాత ఈనాడు ఆసంఘటనను మననం చేసుకుంటే ఆరోజు ఆ క్షణాన నాలేత బుర్రలో చెలరేగిన ఆలోచనలన్నీ ఎంతో విపరీతంగా భాసిస్తున్న మాట నిజమే! కానీ ఆనాడవి నాకు సహజంగా తోచాయి. లోకంలో యింతకంటే కర్కశ స్వభావం మరెక్కడా వుండ బోదనుకున్నాను. కుర్రాడన్నతర్వాత వాడికివెయ్యి ఉబలాటాలుంటాయి. వాటిని నెరవేర్చడం తల్లి దండ్రుల కనీసధర్మం. ఆ పని చేతగాక నోరుచేసుకుని చేయిచేసుకుని కుర్రాళ్ళ కోరికలను బలవంతంగా అణగద్రొక్కడం అన్యాయం, అక్రమం! నేనీ అన్యాయాన్ని సహించబోను!! ఈయనకు బుద్ధొచ్చేలా ఏమైనా చేయాలి. ఏం చేయాలి? ఏంచేస్తే ఈయనకు బుద్ధొస్తుంది?

ఎక్కడికైనా పారిపోతే?

అవును. పారిపోవాలి. నాకోసం వెదికి వెదికి ఈయన వేసారిపోవాలి. పదిరూపాయలిచ్చివుంటే కుర్రాడుయింటిపట్టునే వుండి కంటికి కనిపిస్తూ వుండేవాడుగదా అన్న పశ్చాత్తాపంతో దహించుక పోవాలి.

ఆ రాత్రి సైతం నేను నిద్రపోదలుచుకో లేదు. ఎప్పుడెప్పుడు కోడికూస్తుందోనని కాచుక కూర్చున్నాను.

కోడి కూయనే కూసింది. లేచి మెల్లగా బయటికి వచ్చాను. మసక చీకటితో రోడ్డువెంట నడవసాగాను.

పట్టణం చేరుకునే సరికి గంట ఎనిమిది.

స్కూలు దరిదాపులకు వెళ్ళకుండా సందు గొందుల్లో బడి రైల్వేస్టేషను చేరుకున్నాను. ప్రయాణీకుల సందడిలో స్టేషనుమారుమ్రోగిపోతోంది. ఎవైపునుంచోగాని రైలు రాబోతున్నట్టుంది. అది ఏవైపునుంచి వచ్చినా ఎక్కడికి వెళ్ళినా నాకిబ్బందిలేదు. నేనొక పెట్టెలో దూరి కూర్చుండ గలిగితే చాలు!

కానీ అలా చేయడానికి వీల్లేకపోయింది. గేటు దగ్గర తెల్లటి దుస్తుల్లో ఒకపొడుగాటి టికెట్ కలెక్టరు టికెట్లు తనిఖీ చేసిగానీ ప్రయాణికులను లోపలికి వదలడంలేదు.

కర్తవ్యమేమిటో తోచక విగ్రహంలా బెంచీపైన కూర్చుండి పోయాను. రైలురానూ వచ్చింది. వెళ్ళనూ వెళ్ళిపోయింది.

గంట పది కావస్తోంది.

స్టేషను నుంచి ఈవలకు వచ్చాను. గమ్యస్థానమంటూ ఒకటిలేక వీధులవెంట చెడతిరిగాను. తాలూకాఫీసులో గంట పన్నెండు సార్లు మ్రోగింది.

అప్పుడునేను బస్‌స్టాండు చేరాను. మెల్లిగా బస్సులపైన పేర్లు చదువుకుంటూ వెర్రిగా తిరుగుతున్నాను. కడప, కదిరి, రాయచోటి, తిరుపతి, కాళహస్తి ... ఎక్కడెక్కడికో వెళ్తున్నాయి బస్సులు, కానీ ఏ బస్సులో ఎక్కాలన్నా డబ్బుకావాలి! నాచేతిలో ఒక చిల్లికానీ కూడాలేదు.

ప్రొద్దు పడమటికి వ్రాలిపోయింది. తిరిగి తిరిగీ కాళ్ళు పీక్కుపోతున్నాయి. పారిపోవడం సంగతి దేవుడెరుగు, చల్లని చోటు చూచుకుని కదలకుండా పరుంటే బాగుండు ననిపించింది.

బస్‌స్టాండుకు దగ్గరగా ఒక విఘ్నేశ్వరుని కోవెలవుంది. భక్తులు గణపతికి వీధిలోనుంచే మ్రొక్కులు చెల్లించి వెళ్ళిపో తుండటంవల్ల దేవాలయాంతర్భాగం సాధారణంగా నిర్జనంగానే వుంటుంది. కాళ్ళీడ్చుకుంటూ కాయాన్ని అక్కడికి చేరవేశాను. గర్భగుడి వెనుక వైపున గోడనీడలో చేతినే తలగడగా వుంచు కొని పడుకున్నాను. రాత్రిగూడా సరిగా నిద్రలేదేమో, పడు కోగానే నిద్రపట్టింది. ఎంతసేపు నిద్రపోయానో తెలియదు.

ఓపిక లేకపోయినా లేచి నిల్చున్నాను. వీధిలో వుండి వుండి సైకిళ్ళూ జట్కాలూ పరుగెడు తున్నాయి. పది బారల దూరం నడిచే సరికి నాకో విషయం చటుక్కున స్ఫురించింది. ఇప్పుడు నన్ను ఎదుర్కొంటున్న ప్రశ్న ఎలా పారిపోవాలన్నది గాదు, ఇప్పుడు నన్ను తీవ్రంగా ఎదుర్కొంటున్నది ఆకలి! ప్రేగులు నకనక లాడిపోతున్నాయి.

ఆరాత్రి నాకుకలిగిన వివిధానుభవాల ఆధారంతో నేనొక ముఖ్యమైన విషయం తెలుసుకో గలిగాను. దిక్కులేనివాళ్ళ పాలిటికి ఈ పట్టణం చాలా భయంకరమైనది. ఇక్కడ లెక్క లేనంత మంది నివసిస్తున్నారు. కానీ ఎవడి ధ్యాస వాడిది. ఎదుటి వాడు తిన్నాడా, తినలేదా, ఊపిరితో ఉన్నాడా లేదా అని ఆలోచించే పాటి ఓపిక యిక్కడ ఎవరికీ వున్నట్టు లేదు. వీళ్ళపాటికి బ్రతుకంతా ఒక పరుగుపందెంలావుంది. ఒక్క క్షణం ఆలస్యమైతే ఎక్కడ తమ పుట్టిమునిగి పోతుందోనని వీళ్లు రివ్వు రివ్వున బాణాల్లా దూసుకు పోతారు. ముఖమెరుక లేని వాడెవడైనా వీళ్ళకెదురైతే వీలయినంత వరకూ పట్టించుకోరు. ఒక వేళ పట్టించుకుంటే "ఏవూరు? ఎందుకొచ్చావు? ఎక్కడికి

వెళ్తున్నావు? ఇక్కడేంచేస్తున్నావు?" అంటూ ప్రశ్నల వర్షంతో వేధిస్తారు. ఎంతసేపైనా మాటతేగాని మన్నన కనిపించదు. చివరకు అరుగులపైన గూడా పడుకోనివ్వరు.. 'ఇంతచేవా భగవంతుడా' అని వీధులవెంట తిరుగుదా మనుకుంటే కుక్కలు తిరగనివ్వవు. ఇదంతా చాలక తప్పిదారీ గస్తు తిరిగే పోలీసు వాళ్ళకళ్ళ బడితే——వాళ్ళు ఏడు తరాలనుంచీ తాత ముత్తాతల గాధలు తెలుసుకోందే విడిచిపెట్టరు!

ఆ రోజు రాత్రి సినిమాథియేటరు ప్రాంతంలో కాసేపు తారట్లాడి తిరిగి వస్తుండగా నన్ను కుక్కలు తరుముతున్న మాట వాస్తవమే! ఆ తరువాత నే నొక రక్షక భటుడికి తారసిల్లి, ఒకటి చెప్పబోయి మరొకటిచెప్పి చిక్కి బిక్కరించిన మాటా యథార్థమే! ఎలోగో అతణ్ణి వదిలించుకుని మళ్ళీ వినాయకుని గుడికే దారి తీశాను. కానీ తీరా అక్కడికి వెళ్ళి చూసేసరికి తలుపులు మూసి తాళాలు బిగించేశారు!

మెట్లపైన గూర్చుందామంటేనా, మళ్లీ పోలీసువాడీ దారంట వస్తాడేమోనన్న భయం ఒకవైపున అరుగుపైన పడుకుందామంటేనా, తన్ని తగలేస్తారేమోనన్న భీతి మరొక వైపున! గర్భకుహరంలో చండప్రచండంగా రగులుకుంటున్న క్షుద్బాధ వేరొకవైపున!

భయంతో బాధతో దుఃఖంతో దిగులుతో నాకా రాత్రి శివరాత్రిగా తెల్లవారింది.

లోకానికి సూర్యోదయంతో బాటు నాకు జ్ఞానోదయం గూడా కలిగిన ఆ వుదయం నా కెన్నటికీ మరపురానిది!

నేనుచేసింది తీవ్రమైన పొరబాటు. ఈవిశాల ప్రపంచంలో నాకు చల్లటి ఆశ్రయం లభించేది ఒక్కటంటే ఒక్కచోట మాత్రమే! పన్నీటి జల్లులాంటి వాత్సల్యం నా కక్కడ తప్పితే మరెక్కడా లభ్యంకాదు. అక్కడుంటేనే నాకుతిండి! అక్క డుంటేనే నాకు బట్ట! అక్కడుంటేనే నాకుచదువు!

పువ్వు చెట్లోనే వుండాలి.

విగ్రహం గుడిలోనే వుండాలి.

స్థానభ్రంశం జరిగితే—పువ్వు వాడి పోతుంది, విగ్ర హానికి పూజా పునస్కారాలుండవు.

తలుపులన్నీ వుచ్చులు త్రెంపుకుని యింటివైపుకు పరుగు తీశాయి. ఈ పాటికి మా అమ్మ నా కోసం బెంగపెట్టుకుని నిలువునా నీరై పోయి వుంటుంది. నా మూలంగా దుస్సహమైన వేదనకు గురై కృంగిపోయి వుంటుంది.

చరాలున లేచి నిల్చున్నాను. కళ్ళు తిరుగుతున్న ప్పటికీ లక్ష్యపెట్టకుండా వీధి మలుపు దాకా నడిచాను. ఊహూ, ఎంతగా ప్రయత్నించినా నడవడం సాధ్యం కావడంలేదు. ఇలా కాదని. కొళాయి దగ్గర ముఖం కడుక్కుని కడుపునిండా నీళ్ళు త్రాగేశాను. తెచ్చిపెట్టుకున్న ఓపికతో మళ్ళీ నడక కొన సాగించాను.

అప్పటికే ప్రొద్దు పదెనిమిది బారల ఎత్తున దుర్ని రీక్ష్యంగా మండి పోతుంది. చెట్ల నీడలు కురచలై పోతున్నాయి ముఖం పైన చెమట క్రమ్ముకుంటున్న వురవడిని బట్టిచూస్తే మరికొంత సేపటికి నా దుస్తులు తడిసి ముద్దయి పోయేటట్టు

న్నాయి. అందుకు తోడు వడగాడ్పులు క్షణ క్షణానికీ రాటు దేలి గుంయి గుంయి మంటూ గూబలో గీపెడుతున్నాయి.

పట్టణం పొలిమేరలు దాటి రెండుమైళ్ళు మాత్రం నడవ గలిగాను. ఏదో ఒక అదృశ్యమైన శక్తి నన్ను నడిపించుక పోతోందేగానీ నిజానికి నేను నడవడంలేదు. అడుగులు కడబడు తున్నాయి. ఒళ్ళు తూలిపోతుంది. రాత్రల్లా నిద్రలేని కళ్ళకు మిట్ట పల్లాలన్నీ ఏకంగానే కనిపిస్తున్నాయి.

ఈ సారి ప్రతి పర్లాంగు రాయి దగ్గరా కాసేపు విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నాను. ఈ క్రొత్త నిర్ణయాన్ని ఆసరాగా వుంచుకుని మూడోమైలు రాతిని అధిగమించడానికి అరగంటసేపు పట్టింది. అప్పటికి సూర్యుడు నడిమింటికి అల్లంత దూరంలో వుండి లోకంపైకి చండ్రనిప్పులు వెదజల్లుతున్నాడు.

చెమటలో తడిసి పోయిన చొక్కాను తీసి తలపైన వేసు కుంటూ ముందుకు చూచాను. అప్పుడు బైర్లు క్రమ్మక పోతున్న నా కళ్లకు కనిపించింది. ఒక్కటే ఒక్కటి! అది పచ్చటి ముద్దలా కనిపించింది. ఆకాశానికి హత్తుక పోయిన చిత్రపటంలా కనిపించింది.

కానీ వెనుకటి పరిచయం వల్ల పోల్చుకున్నాను - అది మర్రి చెట్టు!

మళ్లీ అరమైలు దూరం ఎలా నడవగలిగానో నాకు తెలియదు. స్వప్రయత్న మేమీ లేకుండా అంత దూరం నడవ గలగడం ఎలా సాధ్యమైందో చెప్పలేను. కళ్ళు తెరిచేసరికి నేనా

మర్రిచెట్టు నీడలో పడి వున్నాను. నా దగ్గరగా కూర్చుని నాన్న గారు తడి గుడ్డతో మెల్లగా ముఖాన్ని తుడుస్తున్నారు.

కళ్ళు తెరువగానే "లేచి కూచోరా రామం" అన్నారు. కూర్చున్నాను.

చెట్టులోనుంచీ నాలుగాకులు త్రెంపుకుని విస్తరిగా పేర్చారు. టిఫిన్ కారియరులోని అన్నాన్ని తీసి అందులో వుంచారు. "నువ్వు తింటుండరా రామం! నేను వెళ్ళి నీళ్ళు తీసుకొస్తాను" అంటూ కారియర్ తీసుకుని బయల్దేరారు.

ఆకులోని అన్నం వైపొకసారి చూచాను. తల పైకెత్తి మంచి నీళ్ళకోసం వెళ్తున్న నాన్నగారి వైపోసారి చూచాను.

మాసిపోయిన పంచ...చిరుగులు పడిన చొక్కా... పగుళ్ళు కనిపిస్తున్న పెదాలు...తన సౌఖ్యాన్నిత్యాగం చేసి, తన అవసరాలను విస్మరించి ఆయన తనబ్రతుకును ఎవరికోసం అంకితం చేశారు?

చుట్టూరా కష్టనష్టాలే ఆయనకు! కానీ ఆ కష్ట నష్టాలు ఎవరిపైకి ప్రసరించ గూడదని ఆయన ఆకాంక్ష?...

నాన్నగారు నీళ్ళు తెచ్చారు. నేను భోజనం ముగించాను.

"ఎండ తగ్గాక వెళ్దాంగానీ కాసేపు పడుకోరా రామం." అన్నారు నాన్నగారు.

ఆ సంఘటన జరిగి చాలా కాలమైంది. ఆ మర్రిచెట్టును తలచుకున్నప్పుడల్లా నాకు మా నాన్నగారు జ్ఞప్తికి వస్తారు. నాన్నగారిని తలుచుకున్నప్పుడల్లా ఆ మర్రి చెట్టు మదిలో మెదలుతుంది. కానీ నాన్నగారు చనిపోయారు. మర్రి చెట్టు మాత్రం అక్కడే వుంది. భూకంపాలు సంభవించక పోతే, ఝంఝామారుతాలు చెలరేగి చెట్టును వ్రేళ్లతో సహా మూల మట్టంగా పెల్లగించక పోతే, బొగ్గుల కోసం కల్ప తరువును పొడిచే మానవుని అజ్ఞానం శృతిమించి రాగానే పడక పోతే ఆ చెట్టు శతాబ్దాలపాటు అక్కడే వుంటుంది గూడా!

కథా నిలయం
5861
శ్రీకాకుళం